ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత గురువారం గరిష్ఠం : 37.0 కనిష్ఠం : 27.0
ANDHRAJYOTHY 5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శుక్రవారం 2 మే 2025

ప్రభుత్వం మారినా వారిదే హవా

- వైసీపీ సేవలో తరిస్తున్న కొందరు అధికారులు
- పనులు జరగక కూటమి నాయకుల పాట్లు





కలెక్టరేట్‌లో వైసీపీ పాలన

పుట్టపర్తి టౌన్, మే 1(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో 'వైసీపీ' పాలన సాగుతోంది. కొందరు అధికారులు ఆ పార్టీ నాయకులకు సానుభూతిపరులుగా, కోవర్టులుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం మారి 11 నెలలు అవుతున్నా కొందరి వ్యవహార శైలిలో ఏమాత్రం మార్పు రావడం లేదు. మునుపటి ప్రభుత్వం నాటిన విత్తనాలు వైసీపీ నాయకులకు ఇప్పటికీ ఫలాలను ఇస్తున్నాయని ప్రచారం జరుగుతోంది. అధికారంలో ఉన్నా.. పనుల కోసం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోంది. వైసీపీ నాయకులు మాత్రం ఎటువంటి ఇబ్బంది లేకుండా పనులు చక్కబెట్టుకుంటున్నారు. ఒక్క ఫోన్ కాల్‌తో కలెక్టరేట్‌లో ఫైళ్లను కదిలిస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం అధికార పార్టీలవారు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లితే సవాలక్ష సందేహాలు వ్యక్తం చేస్తూ, పనులు చేయకుండా తిప్పి పంపుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో కార్యకర్తలా పనిచేసిన కొందరు అధికారులు నేటికీ కలెక్టరేట్‌లో చక్రం తిప్పుతున్నారని అంటున్నారు

ఆ ఇద్దరిదే హవా..

కలెక్టరేట్‌లో కీలకమైన పౌరసరఫరాల శాఖలో ఇద్దరు అధికారులు వైసీపీ నాయకులకు కోవర్టుల్లాగా తయారయ్యారు. ఆ శాఖలో హవా నడిపిస్తున్నారు. వైసీపీ నాయకులకు మేలు చేయడంలో ఎప్పుడూ ముందుంటారు. జిల్లాలోని పలువురు వైసీపీ ముఖ్యులతో ఈ ఇద్దరికి విడదీయరాని అనుబంధం ఉంది. వైసీపీ నాయకులు ఆర్థికంగా ఎదగడానికి ఈ ఇద్దరి అధికారులు అడ్డదిడ్డంగా పనులు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కలెక్టరేట్‌లో వారికి ఏ పని కావాలన్నా ఈ ఇద్దరు అధికారులు స్వామి భక్తితో చేసిపెడుతుంటారని సమాచారం. చేసేది చిన్న ఉద్యోగమైనా.. అక్రమ సంపాదనతో రూ.కోట్లకు పడగలెత్తినట్లు తెలుస్తోంది. కలెక్టరేట్‌కు కొత్తగా ఏ అధికారి వచ్చినా ప్రలోభాల ఎర చూపి, వారిని బుట్టలో వేసుకోవడంలో ఆరితేరారని అంటున్నారు. ఈ ఇద్దరు అధికారులు చెప్పిన పనిచేసిన ఓ మహిళా అధికారికి రూ.25 లక్షల విలువైన కొత్త కారును బహూకరించారని ప్రచారం జరుగుతోంది.



ఇక్కడ నలుగురు..

కలెక్టరేట్ భూసేకరణ విభాగంలో నలుగురు అధికారులు వైసీపీ నాయకులతో అంటకాగుతున్నారు. భూసేకరణ వ్యవహారంలో వీరు వైసీపీ నాయకులకు పెద్ద మొత్తంలో లబ్ధిచేకూర్చినట్లు సమాచారం. వైసీపీ నాయకులకు మేలు చేయడం, అందినకాటికి దోచుకోవడం వీరికి అలవాటుగా మారిందని అంటున్నారు. జిల్లాలో భూసేకరణ విషయంలో వైసీపీ నాయకులకు అనుకూలంగా వీరు పనులు చక్కబెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి.

వైసీపీకి ఒకలా.. మాకు ఇంకోలా..





పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలో సర్వే నంబర్ 500- 2బి2లో ఉన్న 2.63 ఎకరాలలో పది సెంట్ల స్థలాన్ని పది సంవత్సరాల క్రితం కొనుగోలు చేశాం. బ్యాంకు రుణం తీసుకుని ఇల్లు కట్టుకున్నాం. నాతోపాటు చాలామంది టీడీపీ కార్యకర్తలు, సానుభూతి పనులు ఇదే సర్వే నంబరులో భూములు కొనుగోలు చేసి ఇళ్లు, దుకాణాలు నిర్మించుకున్నారు. ఆరేళ్ల క్రితం ఈ సర్వే నంబరులోని 2.63 ఎకరాలను 22ఎలో చేర్చారు. క్రయవిక్రయాలు జగకుండా నిషేధించారు. ఇదే సర్వే నంబరులో ఓ వైసీపీ కౌన్సిలర్ 14 సెంట్లు భూమిని కొనుగోలు చేయగా, 2022లో అప్పటి వైసీపీ ప్రభుత్వం 22ఎ నుంచి తొలగించింది. విక్రయించేందుకు అతనికి అవకాశం కల్పించింది. మావి మాత్రం ఇప్పటికి నిషేధిత జాబితాలోనే ఉంచారు. ఈ విషయం గురించి పలుమార్లు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. ఒకే సర్వే నంబరులో వైసీపీ నాయకులకు ఒకలా, మిగిలినవారికి ఇంకోలా అధికారులు పనిచేశారు. మేము టీడీపీ సానుభూతి పరులు కావడంతో ఉద్దేశపూర్వకంగా కలెక్టరేట్‌లోని వైసీపీ కోవర్టులు మా సమస్యను పరిష్కరించలేదు.

- జయప్రకాష్, మామిళ్ల కుంట క్రాస్, పుట్టపర్తి

ముగ్గురు కలెక్టర్లు మారినా..

కొత్తచెరువు రెవెన్యూ పొలం సర్వే నంబర్ 219లో మాకు 2.50 ఎకరాల పొలం ఉంది. బీసీ కాలనీ నుంచి వచ్చే మురుగునీటిని వైసీపీ హయాంలో మా పొలంలోకి మళ్లించారు. దీనివల్ల పంటలు పడకపోగా, పొలంలో ఉన్న వివిధ రకాల వంద చెట్లు చనిపోయాయి. సమస్యను పరిష్కరించాలని కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ముగ్గురు కలెక్టర్లు మారారే తప్ప మా సమస్య పరిష్కారం కాలేదు.



- కుమార్ చంద్రకాంత్, రైతు, కొత్తచెరువు

పరిహారం ఇవ్వలేదు..



నేషనల్ హైవే 342 నిర్మాణం కోసం 1.20 ఎకరాల భూమిని ప్రభుత్వం తీసుకుంది. రెండేళ్లు దాటినా మాకు పరిహారం ఇవ్వలేదు. కలెక్టరేట్‌కు వచ్చి అర్జీలు ఇచ్చినా పట్టించుకోలేదు. సమాచార హక్కు చట్టం కింద వివరాలు కోరినా ఇవ్వడం లేదు. కానీ రహదారి నిర్మాణానికి భూమి పోకున్నా, కొంతమంది వైసీపీ సానుభూతి పరులకు పరిహారం ఇవ్వడానికి అధికారులు సిద్ధమయ్యారు. ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి.

- పోతులయ్య, రైతు పుట్టపర్తి

మా స్కూల్లో చేర్చండి..!

ప్రభుత్వ టీచర్ల ఇంటింటి ప్రచారం



దొరిగల్లు ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరుతున్న ఉపాధ్యాయులు

ముదిగుబ్బ, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుత విద్యార్థుల సంఖ్య కంటే పది శాతం పెంపు ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రతి క్లస్టర్ పరిధిలో నమోదు తక్షణమే చేపట్టాలని పేర్కొంటూ, పర్యవేక్షణ బాధ్యతను ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో పథకాల గురించి, విద్యా బోధన గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. మండల వ్యాప్తంగా 72 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 3,544మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రీ ప్రైమరీ 1, 2 చదువుతున్న చిన్నారుల వివరాలను అంగన్వాడీ కార్యకర్తలు సేకరిస్తున్నారు. వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఉచితంగా కిట్లు... భోజనం

ప్రభుత్వ విద్యా సంస్థలలో చేరిన పిల్లలకు సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో ఉన్న కిట్లు అందజేస్తారు. అందులో పుస్తకాలు, యూనిఫాం ఉంటాయి. పాఠశాలలో చేరాకా రెండు జతల బూట్లు, సాక్సులు, బెల్టు అందిస్తారు. వారంలో పిల్లలకు మూడు రోజుల పాటు ఉదయం రాగిజావ, మరో మూడు రోజులు బెల్లం, వేరుశనగ చిక్కీ, ఐదు రోజులు కోడిగుడ్లు, ఆరు రోజుల పాటు మధ్యాహ్నా భోజనం అందిస్తారు.

ఇంటింటికి వెళ్తున్నాం: రమణప్ప, మండల విద్యాశాఖ అధికారి-2, ముదిగుబ్బ

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రవేశాలకు శ్రీకారం చుట్టాం. ఇంటింటికి వెళ్లి పిల్లల జాబితాను సేకరిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. ముదిగుబ్బ మండలంలో ఉపాధ్యాయులు ఈ పనిలో ఉన్నారు.

బైపాస్ కెనాల్‌కు ఆమోదం.. హర్షణీయం


- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు

మడకశిర టౌన్, మే1(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న మడకశిర బైపాస్ కెనాల్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ వల్లే సాధ్యమైందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. తన క్యాంపు కార్యాలయలో గురువారం ఆయన మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి విలేకరులతో మాట్లాడారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నేరుగా మడకశిర నియోజకవర్గంలోని అన్ని చెరువులను నీటితో నింపడం కోసం బైపాస్ కెనాల్ ఏర్పాటు చేయాలని గత వైసీపీ ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ఫలితం లేక పోయిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మడకశిర పర్యటన సందర్భంగా సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి బైపాస్ కెనాల్‌కు ఆమోదం తెలుపుతూ ఆర్థిక శాఖ అనుమతికి పంపడం హర్షణీయం అన్నారు. ముఖ్యమంత్రి పర్యటించిన 8నెలల్లోనే అనుమతులు రావడం ఈ ప్రాంత ప్రజల పట్ల చంద్రబాబుకు ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. ఆర్థిక శాఖ అనుమతులు త్వరగా వస్తాయని ఆశాభవం వ్యక్తం చేశారు. బైపాస్ కెనాల్ నిర్మాణం పూర్తి అయితే భవిష్యత్తులో సాగు, తాగునీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కారం లభిస్తుందన్నారు.

రైతు ఆశలపై దాడి



నాగభూషన్‌రెడ్డి

కర్బూజను ధ్వంసం చేసిన ఎలుగుబంట్లు

మడకశిర రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఆమిదాలగొంది గ్రామ సమీపంలో సాగుచేసిన కర్బూజ పంటను ఎలుగుబంట్లు ధ్వంసం చేసినట్లు రైతు నాగభూషన్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. తనకు ఉన్న రెండు ఎకరాల్లో కర్బూజ పంటను సాగు చేసినట్లు తెలిపారు. చేతికి వచ్చిన పంటను గురువారం రాత్రి ఎలుగుబంట్లు ధ్వంసం చేసినట్లు తెలిపారు. దాదాపు రెండు టన్నుల కర్బూజ పంటను నాశనం చేశాయన్నారు. తనకు సుమారు రూ.60 వేలు వరకు నష్టం కలిగినట్లు తెలిపారు. ఈ విషయం అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

కర్బూజ పంటను ధ్వంసంచేసిన ఎలుగుబంట్లు

మరో చాన్స్..!

- పదిలో తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- జిల్లాలో పలు చోట్ల ప్రారంభం
- సబ్జెక్టుల వారిగా క్లాసులు



కొత్తచెరువు, మే 1(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదో తరగతి ఫెయిల్ అయిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురువారం నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభం అయ్యాయి. ఈ తరగతులు ఈ నెల 18 వరకు నిర్వహించనున్నారు. జిల్లాలో ఈ ఏడాది 21,084 మంది విద్యార్థులు పది పబ్లిక్ పరీక్షలు రాయగా 15,769 మంది మాత్రమే పాస్ అయ్యారు. ఈ నేపథ్యంలో ఫెయిల్ అయిన విద్యార్థులను అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ప్రభుత్వం రెమెడియల్ క్లాసులకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా గురువారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక తరగతులు ప్రారంభం అయ్యాయి.

ప్రత్యేక తరగతులు వివరాలు ఇలా

జిల్లాలో పది పరీక్షల్లో మొత్తం 5315 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. వారికి సబ్జెక్టుల వారిగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ తరగతుల నిర్వహణకు మండలా ల్లో ఫెయిల్ అయిన విద్యార్థులను బట్టి ఒకటి లేదా రెండు హైస్కూళ్లను ఎంపిక చేశారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రత్యేక తరగతులు జరగనున్నాయి. ఉదయం 8 నుంచి 9.15 వరకు హిందీ, సోషియల్, 9.15 నుంచి 10.15 వరకు ఇంగ్లిష్, సైన్సు, పీఎస్, బయాజికల్ సైన్సు, 10.30 నుంచి 12 గంటల వరకు గణితం, తెలుగు బోధిస్తారని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ఫెయిల్ విద్యార్థుల వివరాలు

సబ్జెక్టు	విద్యార్థులు	పాస్ అయిన వారు	ఫెయిల్ వారు
తెలుగు	21,067	19,867	1200
హిందీ	21,071	20,856	215
ఇంగ్లిష్	21,068	20,051	1017
గణితం	21,063	17,571	3,490
సైన్సు	21,056	18,375	2,688
సోషియల్	21,056	18,425	2,631

ప్రత్యేక చర్యలు

పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు ఏడాది నష్టపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఇందుకోసమే సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తోంది. ఫెయిల్ అయిన ప్రతి విద్యార్థి పాస్ కావడం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా ఉన్న సబ్జెక్టు ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారి ద్వారా తరగతులను రొటేషన్ పద్ధతిలో నిర్వహిస్తాం.

- కిష్టప్ప, డీఈఓ

స్పెషల్ క్లాస్‌లకు డుమ్మా

కదిరి, మే1(ఆంధ్రజ్యోతి): సమాచారం లేకపోవడంతో విద్యార్థులు స్పెషల్ క్లాసులకు డుమ్మా కొట్టారు. పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు గురువారం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ తరగతులకు తొలిరోజు ఏ పాఠశాలలోనూ విద్యార్థులు హాజరుకాలేదు. ప్రభుత్వ బాలుర, బాలికల, ఉన్నతపాఠశాలతో పాటు మున్సిపల్ హైస్కూల్‌లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సమాచారం లేకపోవడం వల్లే విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిసింది. విద్యార్థులకు శుక్రవారం నుంచి అయినా టైంటేబుల్ తెలపాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అయితే ప్రధానోపాధ్యాయులు మాత్రం ఫెయిల్ విద్యార్థులందరికీ సమాచరం ఇచ్చినట్లు పేర్కొన్నారు.



ఎరుపెక్కిన దిక్కులు

వాడవాడలా ఘనంగా మే డే

పుట్టపర్తిలో మేడే సందర్భంగా జెండాను అవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి



ధర్మవరంలో..



కదిరిలో ..

అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని జిల్లాలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు ఎర్ర జెండా చేత పట్టి ఊరూ వాడా ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మేడే విశిష్టతను వివరించారు. కార్మికుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. పుట్టపర్తి మునిసిపల్ కార్యాలయం వద్ద ఎర్ర జెండాను ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆవిష్కరించారు. కార్మికుల కాయ కష్టంతోనే అమరావతి, పోలవరం నిర్మాణాలు సాగుతున్నట్లు తెలిపారు. కార్మికుల ఎర్ర జెండాల ర్యాలీలతో వీధులు ఎరుపెక్కాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


నరసింహులు (ఫైల్)

కనగానపల్లి, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్వతదేవరపల్లి 44వ జాతీయ రహదారిపై గురువారం 407 వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు మామిళ్లపల్లి గ్రామానికి చెందిన నరసింహులు(53) మతిస్థిమితం లేక రోడ్ల వెంబడి తిరుగుతుండేవాడు. ఈ క్రమంలోనే పర్వతదేవరపల్లి వద్ద ఉండగా పెనుకొండ నుంచి అనంతపురం వైపు వెళుతున్న 407 వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని హైవే పెట్రోలింగ్ సిబ్బంది అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య నాగలక్ష్మి, ఇద్దరు పిల్లలున్నారు. కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వడ్డీ వ్యాపారి వేధింపులతో ఆత్మహత్య


మల్లేష్ (ఫైల్)

బత్తలపల్లి, మే1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నేకుంటపల్లి రైల్వేస్టేషన్ వద్ద రైలు కింద పడి మల్లేష్(48) వ్యక్తి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన మేరకు కోడెకండ్ల గ్రామానికి చెందిన మల్లేష్ బుధవారం రాత్రి ఎవరికీ చెప్పకుండా ఇంటిలో నుంచి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం చిన్నేకుంటపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు రైల్వేపోలీసులకు సమాచారం అందింది. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ఆరా తీయగా కోడెకండ్ల గ్రామానికి చెందిన మల్లేష్‌గా గుర్తించారు. మల్లేష్ ధర్మవరంలోని ఓ వడ్డీ వ్యాపారి వద్ద అధిక వడ్డీకి అప్పు చేశాడు. అప్పు చెల్లించలేదని ఇతడికి సంబంధించిన ట్రాక్టర్, రెండు బైకులు, ఒక కారును ఆ వడ్డీవ్యాపారి తీసుకెళ్లాడు. అయినా అప్పు తీరలేదని బెదిరించడంతో ఓ వైపు అవమానభారం, మరోవైపు అప్పుతీరలేదని ఆవేదనతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. మృతుడికి భార్య, కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

గోరంట్ల, మే 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రామాలయం వీధికి చెందిన వివాహిత అశ్విని అదృశ్యంపై గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. రవీంద్రారెడ్డి భార్య అశ్విని ఇంటి నిర్మాణం కోసం కరిడి బ్యాంక్‌లో రుణం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన నెలసరి కంతు రూ. 12వేలు బ్యాంక్‌లో చెల్లించడం కోసం గతనెల 26న కదిరికి వెళ్లారు. తరువాత ఆమె రాకపోవడం, ఫోన్ చేసిన స్విచ్ ఆఫ్ రావడంతో భర్త, బంధువులు ఆమెకోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ లభించకపోవడంతో భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడి మృతి

బుక్కపట్నం, మే1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకంపల్లి గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన పోతన్న (84) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న చెట్టు కింద గ్రామానికి చెందిన పోతన్న, పెద్దన్న కుర్చొని మాట్లాడుకుంటున్నారు. బుక్కపట్నానికి చెందిన శ్రీరామరెడ్డి అనే వ్యక్తి నిర్లక్ష్యంగా ద్విచక్రవాహనం నడుపుకుంటూ వారిని ఢీకొట్టాడు. పోతన్న ముఖంపై బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పెద్దన్నకు కాలు విరిగింది. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, గాయపడిన పెద్దన్నను పుట్టపర్తి ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ క్రిష్ణమూర్తి తెలిపారు.

చీనీ టన్ను రూ. 22వేలు

అనంతపురం రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 22వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 8వేలు, సరాసరి రూ. 14వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 875 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

జనన.. మరణ రికార్డులతో ఓటరు జాబితా అనుసంధానం

అనంతపురం టౌన్, మే 1(ఆంధ్రజ్యోతి): పారదర్శక ఓటరు జాబితా తయారీకి కేంద్ర ఎన్నికల కమిషన్ మరో చర్యను తీసుకుంది. ఇప్పటికే ఓటరు కార్డుకు ఆధార్‌ను అనుసంధానం చేయిస్తోంది. మరింత ఖచ్చితత్వం కోసం జనన, మరణ రికార్డులతో ఓటరు జాబితాను అనుసంధానం చేయాలని కలెక్టర్లను ఆదేశించింది. ఈ ఉత్తర్వులు కలెక్టరేట్‌కు గురువారం చేరాయి. ఈ ప్రక్రియ పూర్తయితే, మరణించిన వ్యక్తి పేరును ఓటరు జాబితా నుంచి తొలగించడం సులభతరమౌతుంది. బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి పక్కా సమాచారాన్ని సేకరించి, వివరాలు నమోదు చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

16న జడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం విద్య, మే 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 16న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీలోని సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. ఈ మేరకు జడ్పీ చైర్మన్, మంత్రులు, జడ్పీ వైస్ చైర్మన్లు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇతర సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

కార్మిక హక్కుల కోసం పోరాడుతాం

మేడే సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



ప్రసంగిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కుల సాధన కోసం శక్తివంచన లేకుండా పోరాడుతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు. మే డేను పురస్కరించుకుని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఎర్ర జెండాలను ఎగురవేసి ర్యాలీలు నిర్వహించారు. అనంతపురం నగరంలో కృష్ణ కళామందిర్ నుండి క్లాక్‌టవర్ మీదుగా లలితకళాపరిషత్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పరిషత్‌లో నిర్వహించిన సభలో రాంభూపాల్ మాట్లాడుతూ 1886 చికాగో నగరంలో 8 గంటల పని దినం కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన వీరులను స్మరించుకుంటూ, రాబోయే రోజుల్లో కార్మిక హక్కుల సాధన కోసం పోరాడుతామని దీక్షబూనే రోజే మేడే అన్నారు. హక్కుల కోసం కార్మిక సంఘాల నిర్మాణం, ట్రేడ్ యూనియన్ల ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. ఎన్నో త్యాగాలతో సాధించుకున్న హక్కులు నేటి పాలకవర్గాల విధానాల వల్ల నిర్వీర్యమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ... మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొనుగోలు శక్తి తగ్గిపోవడం, నిరుద్యోగం, శాంతిభద్రతల సమస్య, ఆకలిచావులు, రైతుల ఆత్మహత్యలు, మతవిద్వేషాలతో ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. కశ్మీర్ ఉగ్రదాడి ఘటనను సైతం కేంద్రం రాజకీయ ప్రయోజనాలకు వాడుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. దేశ రక్షణ కోసం ఈనెల 20న కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటనారాయణ, ముత్తుజ, వలి, కృష్ణవేణి, శ్రీనివాసులు, సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, ఆజామ్, ఎర్రిస్వామి, తిరుమలేష్, లక్ష్మీనరసమ్మ, సుధాకర్, మసూద్, అలీఫ్, హజీవలి, ఆది పాల్గొన్నారు.


డప్పుకొడుతున్న కళాకారులు

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి: ఏఐటీయూసీ



నగరంలో ర్యాలీ చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

అనంతపురం విద్య, మే 1 (ఆంధ్రజ్యోతి): కేంద్రం లేబర్ కోడ్స్ రద్దు చేసి, కార్మిక చట్టాలను కొనసాగించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. కార్మిక దినోత్సవాన్ని గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నగరంలో యూనియన్ కార్యాలయాల వద్ద, కూడళ్లలో, కాలనీల్లో ఘనంగా నిర్వహించారు. తర్వాత నగరంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి కృష్ణకళామందిర్ వరకూ 136 అడుగుల జెండాతో నాయకులు, కార్మికులు ర్యాలీ నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ కార్మికుల ఎన్నో పోరాటాల ఫలితమే మే డే అన్నారు. కార్పొరేట్లకు అనుకూలంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, ఇతర నేతలు కృష్ణుడు, రాజు, రామకృష్ణ, బాషా, ఇబ్రహీం, మనోహర్, రమేష్ పాల్గొన్నారు.

నేడు రెండు రైల్వే ప్రాజెక్టుల ప్రారంభం

ప్రారంభించనున్న ప్రధాని మోదీ


నిర్మాణం పూర్తయిన వెస్ట్ గుంతకల్లు-మల్లప్పగేట్ బైపాస్ లైన్

గుంతకల్లు, మే 1(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే డివిజన్‌కు చెందిన రెండు ప్రాజెక్టులను ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ప్రారంభించనున్నారు. రాజధానితోపాటు పలు ప్రాజెక్టుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల కోసం ప్రధానమంత్రి శుక్రవారం రాష్ట్రానికి రానున్నారు. ఈ సందర్భంగా గుంతకల్లు డివిజన్‌లో పూర్తయిన రెండు ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. ఈ రెండు ప్రాజెక్టుల వల్ల గుంతకల్లు-విజయవాడ లైన్‌లో ప్రయాణికులకు చేరవేసే రైళ్ల నియంత్రణ, వాటి సమయపాలన, సరుకు రవాణా రైళ్ల ట్రాఫిక్‌కు ఉపయోగం కలగనుంది.

సరుకు రవాణా కోసం బైపాస్ లైన్

కర్ణాటకలోని జిందాల్ తదితర స్టీల్ ప్లాంట్ల నుంచి విజయవాడ వైపు వెళ్లే సరుకు రవాణా రైళ్ల సౌకర్యం కోసం వెస్ట్‌గుంతకల్లు-నంచర్ల రైల్వేస్టేషన్ల మధ్య ఓ బైపాస్ లైన్‌ను నిర్మించేందుకు రైల్వేశాఖ అంచనాలను తయారుచేసింది. ఈ లైన్ నిర్మాణానికి అవసరమైన భూమిని సేకరించే కార్యక్రమాన్ని గత సంవత్సరంలో చేపట్టారు. రైతులకు భూ పరిహారం చెల్లింపు విషయంలో మంతనాలు జరుగుతున్నాయి. భూ సేకరణకు, ట్రాక్ నిర్మాణం కోసం రూ. 293 కోట్లతో చేపట్టనున్న ఈ రైల్వే ప్రాజెక్టుకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. ఈ బైపాస్ లైన్ నిర్మాణం వల్ల సరుకు రవాణా రైళ్లను గుంతకల్లు రైల్వే స్టేషన్‌లోకి తీసుకురాకుండా నేరుగా విజయవాడ లైన్‌లోకి పంపుతారు. దీని వల్ల రైల్వే స్టేషన్‌లో ట్రాఫిక్ తగ్గి ప్రయాణికుల రైళ్లకు అంతరాయాలు తగ్గుతాయి.

గుంటూరు డబ్లింగ్‌లో ట్రాక్ ప్రారంభం

రాష్ట్ర రాజధానికి రైళ్ల కనెక్టివిటీ, ట్రాఫిక్ నియంత్రణ కోసం 2016-17 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం రూ. 3,887 కోట్లను విడుదల చేసింది. వీటి ద్వారా గుంతకల్లు-గుంటూరు రైల్వే సెక్షన్ విద్యుద్దీకరణతోపాటు ట్రాక్‌ను డబుల్ చేసే పనులు ప్రారంభమయ్యాయి. ఈ 401 కి.మీ.ల లైన్ నిర్మాణ పనులు తొమ్మిదేళ్లుగా సాగుతున్నాయి. దాదాపు 85 శాతం పనులు పూర్తి అయ్యాయి. డబ్లింగ్ పనులలో భాగంగా బుగ్గనపల్లి సిమెంటునగర్-పాణ్యం రైల్వే సెక్షన్‌లో 18 కి.మీ.ల రైల్ రోడ్డు పూర్తి కావడంతో ఆ లైన్‌ను ప్రధాని శుక్రవారం లాంఛనంగా ప్రారంభిస్తారు. ఫలితంగా గుంతకల్లు-గుంటూరు రైల్వే లైను మొత్తం డబ్లింగ్ పూర్తి కానుంది. ఈ లైన్ డబ్లింగ్ అయితే ఎక్స్‌ప్రెస్ రైళ్లు, గూడ్సు రైళ్ల వేగాలు పెరగడంతోపాటు, ట్రాఫిక్ వల్ల అంతరాయాలు తగ్గిపోతాయి. ఈ ప్రాజెక్టుల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రయాణికులు తిలకించేలా డివిజనల్ రైల్వే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సాయమందిస్తే ఎవరెస్టును ఎక్కుతా

- జేసీ ప్రభాకర్ రెడ్డికి సమీరా ఖాన్ వినతి


సమీరాఖాన్‌ను అభినందిస్తున్న మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి

తాడిపత్రి, మే 1(ఆంధ్రజ్యోతి): సహాయ సహకారాలు అందిస్తే ఎవరెస్ట్ శిఖరాన్ని ఎక్కుతానని పర్వతారోహకురాలు సమీరాఖాన్ అన్నారు. తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డిని గురువారం ఆమె కలిశారు. ఇప్పటి వరకు తాను 37 దేశాల్లో సైకిల్ యాత్ర చేశానని, 11 పర్వతాలు అధిరోహించానని తెలిపారు. ఎవరెస్ట్ శిఖరాన్ని ఎక్కేందుకు సాయపడాలని జిల్లాలో చాలామంది నాయకులను కలిసి విన్నవించానని, ఎవరూ సాయపడలేదని తెలిపారు. తాను ఎన్నో కష్టాలు పడ్డానని, తల్లిదండ్రులను కోల్పోయానని అన్నారు. జేసీ ప్రభాకర్ రెడ్డి సాయం చేస్తారని నమ్మకంతో ఇక్కడికి వచ్చానని తెలిపారు. ఆయన సాయం చేయడంతోపాటు అల్ట్రాటెక్, అదానీ, అర్జాస్, సాగర్, మెఘా అనే కంపెనీల ప్రతినిధులకు ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి స్వయంగా ఫోన్ చేసి మాట్లాడి సాయం చేయాలని తనకు సంతోషం కలిగిస్తోందని అన్నారు. జేసీ కుటుంబానికి రుణపడి ఉంటానని కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 5 నుంచి సైకిల్‌యాత్ర ప్రారంభించి, నేపాల్‌లో ముగిస్తానని తెలిపారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, మహిళా సాధికారత కోసం సైకిల్ యాత్ర చేస్తున్నానని ఆమె అన్నారు. అనంతరం జేసీ ప్రభాకర్‌రెడ్డి జెండా ఊపి సమీరా ఖాన్ సైకిల్ యాత్రను ప్రారంభించారు.

పింఛన్ సొమ్ముతో పరార్

గతంలో వేలిముద్ర వేయించుకుని బురిడీ

మారని డిజిటల్ అసిస్టెంట్ ఉపేంద్ర తీరు


పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న బెళుగుప్ప లబ్ధిదారులు

బెళుగుప్ప, మే 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఒకటో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ఉపేంద్ర రూ.2.58 లక్షల పింఛన్ సొమ్ముతో ఉడాయించాడు. పంచాయతీ కార్యదర్శి శివరంజని బుధవారం మధ్యాహ్నం పింఛన్ సొమ్మును బ్యాంకు నుంచి డ్రా చేశారు. ఉపేంద్రకు 61 మంది లబ్ధిదారులకు సంబంధించిన రూ.2.76 లక్షలను అందజేశారు. ఉపేంద్ర గురువారం ఉదయం 11 గంటల సమయంలో ముగ్గురు లబ్ధిదారులకు రూ.6 వేలు మాత్రమే ఇచ్చాడు. మిగిలినవారికి పైసా కూడా ఇవ్వకపోవడంతో అసహనం వచ్చి ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి శివరంజని దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వారు అప్రమత్తమై, వారు ఉపేంద్రకు ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది. సచివాలయ సిబ్బందిని ఆరా తీసినా ఆచూకీ తెలియలేదు. దీంతో బెళుగుప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఉపేంద్ర గతంలోనూ పలువురు లబ్ధిదారుల చేత వేలిముద్ర వేయించుకుని డబ్బులు ఇవ్వలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

రెండు నెలలు డబ్బు ఇవ్వలేదు..



వేలిముద్ర వేయించుకుని రెండు నెలల పింఛన్ డబ్బులు ఇవ్వలేదు. నా ఆరోగ్యం బాగాలేదు. మాత్రలు కొండా మంటే చేతిలో రూపాయి లే దు. ఇలా ఇబ్బందిపెడితే ఎలా? ఆ దేవుడు స్పందించి, పింఛన్ సొమ్ము న్యాయంగా అందేలా చూడాలి.

- ఎల్లమ్మ, బెళుగుప్ప


డబ్బులివ్వకుండా తిప్పుతున్నారు



వేలిముద్ర వేయించుకుని డబ్బులు ఇవ్వలేదు. అడిగితే అదిగో ఇదిగో అంటూ తిప్పించుకుంటున్నారు. గత నెల డబ్బులు కూడా ఇవ్వలేదు.

- తిమ్మక్క, బెళుగుప్ప, ఎస్సీ కాలనీ

పంపిణీ చేయలేదు



ప్రతి నెలా ఒకటో తేదీ వచ్చిందంటే పింఛన్ల పంపిణీ పండుగలా జరిగేది. కానీ ఇప్పుడు ఇస్తారో లేదో తెలియడం లేదు. ఇక నుంచైనా పింఛన్లు సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- ఉలెప్ప, బెళుగుప్ప

కప్పలబండ ఎంఎస్ఎంఈ ప్రారంభం

పైలాన్‌ను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు


నెల్లూరు జిల్లా నారంపేటలో ఎంఎస్ఎంఈ పార్కుల పైలాన్ ఆవిష్కరిస్తున్న సీఎం

పుట్టపర్తి, మే 1(ఆంధ్రజ్యోతి): కప్పలబండ ఎంఎస్ఎంఈ పార్కును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం ప్రారంభించారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటులో భాగంగా రాష్ట్రంలో అభివృద్ధి చేసిన 11 పార్కుల పైలాన్‌ను ప్రోపర్టి శ్రీరాముల నెల్లూరు జిల్లా నారంపేటలో ఆవిష్కరించారు. ఇందులో జిల్లాలోని మామిళ్లకుంట వద్ద 52.94 ఎకరాల్లో రూ.7 కోట్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అభివృద్ధి చేసిన కప్పలబండ ఎంఎస్ఎంఈ కూడా ఉంది. ఈ పార్కుల్లో 32 ప్లాట్లు ఏర్పాటు చేశారు. ప్రధాన, అనుబంధ రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, పార్కింగ్, ఖాళీ స్థలం తదితర సదుపాయాలు కల్పించారు. జిల్లాలోని దాయలూరు, పెనుకొండ, మత్యాలచెరువు, ఆర్ అనంతపురం ఎంఎస్ఎంఈలు ఏర్పాటుకు వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన చేశారు.

చెస్‌లో విద్యార్థుల ప్రతిభ

ఇంటర్నేషనల్ ఫిడే క్లాసికల్ చెస్ రేటింగ్‌లో స్థానం


కార్తికేయన్


నందకిషోర్

అనంతపురం క్లాక్‌టవర్/గుంతకల్లుటౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఫిడే ఇంటర్నేషనల్ క్లాసికల్ చెస్ రేటింగ్‌లో జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులకి స్థానం దక్కింది. ప్రపంచ చదరంగసమాఖ్య, అఖిలభారత చదరంగ సమాఖ్యలు సంయుక్తంగా జారీ చేసిన ఇంటర్నేషనల్ ఫిడే క్లాసికల్ చెస్ రేటింగ్‌లో అనంతపురం నగరానికి చెందిన నందకిశోర్‌కు 1501 ర్యాంక్, గుంతకల్లుకు చెందిన కార్తికేయన్‌కు 1497ర్యాంకు దక్కింది. ఒకే సారి ఇద్దరికి అంతర్జాతీయస్థాయి చెస్‌లో గుర్తింపు రావడం అభినందనీయమని ఆల్ అనంత పూర్ చెస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బాలరాజు, అధ్యక్షుడు శివకుమార్, కోశాధికారి కిశోర్, ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్ కుమార్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జ్‌ల నియామకం

అనంతపురం క్లాక్‌టవర్, మే 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక సహకార పరపతి సంఘాల (సొసైటీలకు) నూతన పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ, సహకార శాఖప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ గురువారం జీఓ నంబరు 229 జారీ చేశారు. బుక్కరాయసముద్రం సొసైటీకి అసిస్టెంట్ రిజిస్ట్రార్ బాలగంగాధర్, ఉరవకొండ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవి, ఆమిద్యాలకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు, బత్తలపల్లి, తిమ్మంపల్లి సొసైటీలకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ మధుసూదన్‌ను నియమించారు. అలాగే కనగానపల్లి సొసైటీకి అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటరామి రెడ్డి, ముదిగుబ్బ సొసైటీకి అసిస్టెంట్ రిజిస్ట్రార్ వస్తూరుస్వామి, ఆర్ అనంతపురం సొసైటీకి అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రభాకర్‌నాయక్, పుట్టపర్తి సొసైటీకి అసిస్టెంట్ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ రెడ్డిలను నియమించారు. అక్టోబరు 30 వరకు ఇన్‌చార్జ్‌ల పాలన కొనసాగనుంది.

అమరావతికి అనంత తమ్ముళ్లు


ప్రత్యేక బస్సుల్లో అమరావతికి బయలుదేరిన అనంతపురం అర్బన్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు

అనంతపురం అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణ సభకు అనంతపురం అర్బన్ నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో నాయకులు, కార్యకర్తలు గురువారం అమరావతికి బయలుదేరి వెళ్లారు. ఆయా బస్సులను ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ కమిటీ సభ్యుడు గంగారామ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జై అమరావతి అంటూ నాయకులు, కార్యకర్తలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

న్యూస్ బాక్స్

4 నుంచి బ్రహ్మోత్సవాలు

ధర్మవరం, మే 1(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 4 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తామని ఈఓ వెంకటేశ్వర్లు, ఆలయ అడహాక్ కమిటీ చైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 4న ధ్వజారోహణం, 5న ఉదయం సూర్యప్రభవాహనం, సాయంత్రం చంద్రప్రభవాహనం, 6న ఉదయం సర్వభూపాల వాహనం, సాయంత్రం సింహవాహనం, 7న ఉదయం కల్పవృక్షవాహనం, సాయంత్రం హనుమ ద్వాహనం, 8న ఉదయం పల్లకి ఉత్సవం, సాయంత్రం కళాణోత్సవం, 9న సాయంత్రం శేషవాహనం, రాత్రి గజవాహనాల్లో స్వామివారు పురవీధుల్లో ఊరేగుతారన్నారు. 10న చెన్నకేశవస్వామి మడుగుతేరు, సాయంత్రం బ్రహ్మరథోత్సవం, సాయంత్రం దూళోత్సవం, 11న అశ్వవాహనం, 12న ఉదయం పుష్పమండపం, వసంతోత్సవం, సాయంత్రం హంసవాహనం, 13న దేవతా ఉద్వాసన, పుష్పయాగం, 14న సాయంత్రం శయనోత్సవం (ఏకాంతసేవ) కార్యక్రమంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

సమస్యలపై ఎంపీడీఓ ఆరా



మురుగు సమస్యపై ఆరా తీస్తున్న ఎంపీడీఓ

ధర్మవరంరూరల్, మే1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేనిపల్లి గ్రామంలో ఎంపీడీఓ సాయిమనోహర్ గురువారం పర్యటిస్తూ సమస్యలపై ఆరా తీశారు. గ్రామనడిబొడ్డున.. ఇళ్ల మధ్యలో డ్రైనేజీ కాలువ ఉందని, దుర్వాసన వస్తోందని, దోమలతో ఇబ్బందులు పడుతున్నామని ఆ గ్రామస్థులు ఆయన వద్ద వాపోయారు. కాలువను శుభ్రం చేయించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు. అనంతరం గ్రామంలో నిర్మించిన పశువుల నీటితొట్టెలను పరిశీలించారు. ఆ నీటిని మూగజీవాల దప్పిక తీర్చడానికే ఉపయోగించాలని గ్రామస్థులకు సూచించారు. ఆయన వెంట పంచాయతీ సెక్రటరీ జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్ర, బలరాం, శ్రీకాంత్, కాటమయ్య, ఓబిలేసు, నాగేంద్ర పాల్గొన్నారు.

సివిల్ కోర్టు న్యాయాధికారిగా వెంకటేశ్వర్లు

ధర్మవరం, మే 1(ఆంధ్రజ్యోతి): స్థానిక సివిల్ కోర్టు న్యాయాధికారిగా వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రేపల్లె నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సివిల్ కోర్టు న్యాయాధికారి గీతావాణి నెల్లూరు జిల్లా కావలికి బదిలీ అయిన విషయం తెల్సిందే. కాగా, న్యాయవాదులు, బార్ అసోషియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది నూతన న్యాయాధికారికి శుభాకాంక్షలు తెలిపారు.

కొనసాగిన సీహెచ్ఓల నిరవధిక సమ్మె



కళ్లు మూసుకుని నిరసన వ్యక్తం చేస్తున్న సీహెచ్ఓలు

పుట్టపర్తిరూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట జిల్లాలోని సీహెచ్ఓలు చేపట్టిన నిరవధిక సమ్మె నాల్గో రోజైన గురువారమూ కొనసాగింది. వారు కళ్లు మూసుకొని నిరసన వ్యక్తం చేశారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

కదిరిఅర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీకళాశాల క్రీడా మైదానంలో ఆర్డీటీ, జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించినట్లు కోచ్ నజీర్ తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, వివరాలకు 94908 60339ను సంప్రదించాలని అన్నారు.

మ మ అనిపించారు ..!

- నిరుపయోగంగా చలివేంద్రం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



నిరుపయోగంగా ఉన్న చలివేంద్రం

ముదిగుబ్బ, మే 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం నిర్వహించే వారపు సంత నుంచి పంచాయతీకి రూ. లక్షల్లో ఆదాయం వస్తోంది. అయితే అక్కడ కనీస సౌకర్యాలనూ అధికారులు కల్పించలేదు. ఎండాకాలం రావడంతో వారపు సంతలో కనీసం తాగునీటి సౌకర్యం కల్పించాలని స్థానికులు పలుమార్లు అధికారులను కోరారు. ఎట్టకేలకు స్పందించిన పంచాయతీ అధికారులు అక్కడ ఓ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి .. చేతులు దులుపుకున్నారు. అనంతరం దాన్ని గురించి ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో అది ఇలా నిరుపయోగంగా మారింది.

మున్సిపల్ డీఈ బదిలీ

కదిరి, మే1 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ డీఈ విజయ్‌కుమార్ బదిలీ అయినట్లు కమిషనర్ కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. విజయ్‌కుమార్‌ను విజయవాడ హెడ్ ఆఫీస్‌కు బదిలీ చేస్తు ఉత్తర్వులు వచ్చాయన్నారు.

పొడి విత్తనాలు దుక్కుల్లో చల్లండి

నల్లమాడ, మే 1(ఆంధ్రజ్యోతి): పొడి విత్తనాలు దుక్కిలో చల్లాలని ఏడీఏ సనావుల్లా పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొండకిందతండా రైతులు రమేష్‌నాయక్, రమణనాయక్ పొలాల్లో ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ.. దుక్కిలో ఐదురకాల ప్రధాన పంటలతో పాటు 20 రకరాల వివిధ పంట గింజలను కలిపి చల్లాలన్నారు. తొలకరి వర్షం కురిసిన వెంటనే విత్తనాలు మొలకెత్తడంతో పాటు సూక్ష్మజీవుల సంఖ్య పెరగడంతో రైతులకు ఆదాయం పెరుగుతుందన్నారు. అలాగే భూసారాన్ని బట్టీ ఎరువులు వాడాలన్నారు. మట్టనమూనాల సేకరణపై రైతులకు అవగాహన కల్పించారు. ఇందులో ఏఓ శంకర్‌నాయక్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

సర్వర్ సమస్య

- అందని సిగ్నల్స్..
- పింఛన్ పంపిణీలో పాట్లు
- మీసేవ, సచివాలయాల వద్ద ప్రజల పడిగాపులు
- పలు సర్వేలకు అటంకం
- రేషన్ డిపోల వద్ద నిరీక్షణ
- పట్టించుకోని బీఎస్ఎన్ఎల్ అధికారులు



ముదిగుబ్బలో నెట్‌వర్క్ సరిగా లేకపోవడంతో పింఛన్ల పంపిణీలో ఇబ్బందులు పడుతున్న సిబ్బంది

ముదిగుబ్బ, మే 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీఎస్ఎన్ఎల్, ఇతర ప్రైవేట్ సంస్థల సిగ్నల్స్ మూడు నెలలుగా సరిగా అందడం లేదు. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై బీఎస్ఎన్ఎల్ అధికారులకు.. ఇతర కంపెనీలకు పలుమార్లు ఫిర్యాదు చేసినా.. వారు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు. మండల కేంద్రంలోనే పరిస్థితి ఇది .. ఇక మారుమూల గ్రామాల్లో పరిస్థితి మరీ ఘోరం. ముదిగుబ్బ ప్రాంతంలో 4జి సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రైవేట్ నెట్‌వర్క్ యాజమాన్యం ... నేటికీ 2జి, 3జి సేవలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ నెట్‌వర్క్‌లు సక్రమంగా పనిచేయని కారణంగా గురువారం సచివాలయ ఉద్యోగులు చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం మందకొడిగా సాగింది. సిగ్నల్స్ కోసం ఉద్యోగులు, లబ్ధిదారులు గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇక ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న ఎన్‌సీఈ సర్వేకు తీవ్ర అంతరాయం కలుగుతోందని ఆ శాఖ వారు వాపోతున్నారు. అలాగే ప్రతి నెలా చౌక ధాన్యాల డిపోల వద్ద లబ్ధిదారులు సిగ్నల్స్ కోసం ఉదయం నుంచే వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆధార్ కార్డుల్లో సవరణ, అప్‌డేట్ కోసం ఆయా సెంటర్ల చుట్టూ బాధితులు రోజుల తరబడి తిరుగుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, మీసేవ కేంద్రాలు నెట్‌వర్క్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. వినియోగదారుల సంఖ్య పెరుగుతోందే తప్ప, అందుకు అనుగుణంగా సేవలను విస్తరించక పోవడంతో ఈ సమస్య వస్తోందని బాధితులు వాపోతున్నారు. ఇప్పటికైనా బీఎస్ఎన్ఎల్, ప్రైవేట్ యాజమాన్యాలు ఈ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పింఛన్ పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే

పింఛన్ల పంపిణీ

కదిరి, మే 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 27, 28 వార్డుల్లో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గురువారం పింఛన్లను పంపిణీ చేశారు. దేశంలోనే ఎక్కడ లేని విధంగా రూ. నాలుగు వేలు పింఛన్ ఇస్తున్న ఘతన టీడీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పర్వీనాభాను, వాల్మీకి పవన్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం తనిఖీ



మాట్లాడుతున్న ఎంపీడీఓ, తహసీల్దార్

ఓబుళదేవరచెరువు, మే 1(ఆంధ్రజ్యోతి):స్థానిక ఎస్సీ హాస్టల్‌లో ప్రభుత్వం నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎంపీడీఓ రాబర్టు విల్సన్, తహసీల్దార్ అనంతాచారి గురువారం తనిఖీ చేశారు. టైలరింగ్‌ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వారి వెంట ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది శ్రీనివాచారి, టైనర్ సుభాషిణి ఉన్నారు.

బీసీ కులగణనపై హర్షం



నరేంద్ర మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ధర్మవరం, మే 1(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా బీసీల కులగణన చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించడంపై బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నామాల శంకరయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక కాలేజ్ సర్కిల్‌లో బీసీ సంఘం నాయకులతో కలిసి ప్రధానమంత్రి నరేంద్రమోడీ, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు.

డీఎల్ఆర్ కాలనీలో చోరీ

ధర్మవరం, మే 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డీఎల్ఆర్ కాలనీ వాసి పోలా అశోక్ కుమార్ ఇంట్లో చోరీ జరిగింది. అతను బుధవారం రాత్రి ఇంటిపై నిద్రిస్తుండగా.. దుండగులు ఇంటిలోకి ప్రవేశించి బీరువా తలుపులు పగలకొట్టి అందులో ఉన్న 12.50 గ్రాముల బంగారు అభరణాలు, రూ. 52 వేలు విలువ చేసే పట్టుచీరలను చోరీ చేశారు. గురువారం ఉదయం విషయాన్ని గుర్తించిన అశోక్‌కుమార్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించామని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ రెడ్డప్ప తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ధర్మవరం, మే 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మకాలనీ వాసి అంజనేయులు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కాలనీ సమీపంలో నిర్మాణుష్య ప్రదేశంలోని ఓ చెట్టుకు ఉరివేసుకుని అతను ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతని మృతదేహాన్ని పోలీసులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అంజనేయులుకు భార్య నారాయణమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య వేరుగా పుట్టింటిలో ఉంటోందని స్థానికులు తెలిపారు.అంజనేయులు ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని, కేసుదర్యాప్తులో ఉందని టూటౌన్ పోలీసులు తెలిపారు.

ఆదమరిస్తే .... అంతే..!



నారేపల్లి వద్ద టర్నింగ్‌లో రక్షణ గోడ లేని వంతెన

కొత్తచెరువు, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారేపల్లి సమీపంలోని బ్రిడ్జికి రక్షణ గోడ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. బుచ్చయ్యగారిపల్లి క్రాస్ నుంచి నారేపల్లికి వచ్చే రహదారిలోని కాలువపై బ్రిడ్జికి ఇరువైపులా రక్షణ గోడ లేదు. పైగా ఈ కాలువ టర్నింగ్‌లో ఉండటంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో రాత్రి సమయాల్లో కొత్తగా ఎవరైనా వాహనదారులు వస్తే.. రోడ్డు సమాంతరంగా ఉందని కాలువల్లోకి దూసుకెళ్లిన సంఘటనలు అనేకం. ఇటీవల నారేపల్లి మీదుగా వెల్దుర్తికి వెళ్తున్న ఆటో అదుపు తప్పి కాలువలోకి పడటంతో పలువురు గాయపడ్డారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ అధికారులు స్పందించి.. రక్షణ గోడ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

సేంద్రియ ఎరువులకు డిమాండ్

గాండ్లపెంట, మే 1(ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులకు భారీ డిమాండ్ ఉంది. సమీపంలోని కర్ణాటక రాష్ట్రంలో డిమాండ్ మరీ ఎక్కువ. ఇక్కడ 30 కేజీల బస్తా ధర రూ. 50 ఉండగా .. కర్ణాటకలో రూ. 100 నుంచి రూ. 120 పలుకుతోంది. దీంతో మండలంలో పలు గ్రామాల నుంచి సేంద్రియ ఎరువులను కర్ణాటకకు తరలిస్తున్నారు. నిత్యం పందుల సంఖ్యలో లారీలు, ఐచర్ వాహనాల్లో తరలిస్తున్నారు. గతంలో పులివెందలకు తరలించేవారు. అయితే ప్రస్తుతం కర్ణాటకలో వివిధ పండ్లమొక్కలు, ఉద్యాన వన పంటలకు సేంద్రియ ఎరువులు అధికంగా వినియోగిస్తుండటంతో అక్కడ డిమాండ్ ఏర్పడింది. మన ప్రాంతంలోని సేంద్రియ ఎరువులకు అధిక డిమాండ్ ఉండటంతో.. ఇక్కడి వారు అధిక ధరకు విక్రయిస్తున్నారు.



ఐచర్ వాహనంలో తరలిస్తున్న సేంద్రియ ఎరువు

పుట్టపర్తికి పూర్వవైభవం తెద్దాం

సత్యసాయి జయంతి ఉత్సవాలపై సమీక్షలో ఎమ్మెల్యే

పుట్టపర్తిరూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తికి పూర్వవైభవం తెచ్చేలా అధికారులు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి సూచించారు. సత్యసాయి బాబా జయంతి ఉత్సవాలు, పుట్టపర్తి అభివృద్ధి, చిత్రావతి సుందరీకరణ పనులు .. తదితర వాటిపై ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. రూ. 105 కోట్లతో చిత్రావతి రోడ్డు విస్తరణ, చిత్రావతి సుందరీకరణ.. తదితర అభివృద్ధి పనులన్నీ నవంబర్‌లో జరిగే బాబా జయంతి ఉత్సవాల నాటికి పూర్తీ చేయాలన్నారు. పట్టణంలో సోలార్ లైట్ల ఏర్పాటు, బుక్కపట్నం చెరువు నుంచి చిత్రావతి చెక్‌డ్యాం నింపడానికి రూ. 3 కోట్లతో ఎత్తిపోతల పథకం అమలుకు ప్రతిపాదనలు పంపాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్కిటెక్ ఇంజనీర్ గణేష్, టూరిజం జిల్లా అధికారి నరసయ్య, ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, డీఈ గంగాధర్, మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే అధికారులతో కలసి చిత్రావతి నది చెక్‌డ్యాం హారతిఘాట్ నదీ పరీవాహక ప్రాంతాలను పరిశీలించారు.

- మేడే సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే జెండాను అవిష్కరించారు. కేక్ కట్ చేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు.
- పుట్టపర్తిలో గురువారం ఉదయం వృద్ధులకు ఎమ్మెల్యే పింఛన్లను పంపిణీ చేశారు.
- ఆసుపత్రిలో చికిత్సలు పొంది ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 17.73 లక్షలు మంజూరైంది. ఆ చెక్కులను ఎమ్మెల్యే వారికి అందజేశారు. పెద్దకమ్మవారిపల్లి 20వార్డుకు చెందిన దేవరెంటి చక్రవర్తికి రూ. 10లక్షలు, వెంగళమ్మచెరువు గ్రామానికి చెందిన బీ గోపాల్‌కు రూ. 5.50 లక్షలు, నల్లమాడ మండలం కుటాలపల్లి గ్రామానికి చెందిన దుద్దుకుంట సోమశేఖర్‌రెడ్డికి రూ. 2,13,406 చెక్కులను అందచేశారు.
- టీడీపీ దివంగత నేత, డాక్టర్ శంకరప్ప 17వ వర్ధంతి సందర్భంగా మామిళ్ళకుంట క్రాస్‌లోని ఆయన సమాధి వద్ద ఎమ్మెల్యే ఘనంగా నివాళులర్పించారు. పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించడంతో పాటు టీడీపీ అభివృద్ధికి శంకరప్ప ఎనలేని కృషి చేశారని కొనియాడారు.



చిత్రావతి హారతిఘాట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

వాడవాడలా కార్మిక దినోత్సవం

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్ : ప్రపంచ మే డే (కార్మికుల దినోత్సవం)ను పుట్టపర్తి, ధర్మవరం, కదిరి నియోజకవర్గాల్లో గురువారం వాడవాడలా సీపీఎం, సీపీఐ, సీఐటీయూ.. నాయకులు నిర్వహిం చారు. ఇందులో ఆర్టీసీ యూనియన్, ఆటో, తోపుడు బండ్ల కార్మికులు, మున్సిపల్ కార్మికులు, చేనేత కార్మికులు, అంగన్‌వాడీ కార్మికులు, హమాలీ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు. ర్యాలీలను నిర్వహించి.. జెండాలను ఆవిష్కరించారు. పోరాటాల ద్వారానే కార్మికుల హక్కులను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు.



నల్లమాడలో ..



ఎన్పీకుంటలో ..



ఓడీసీలో ..



తనకల్లులో ..



గాండ్లపెంటలో ..



బుక్కపట్నంలో ..



తాడిమర్రిలో ..



కొత్తచెరువులో ..



ముదిగుబ్బలో ..

పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిల గడువు పెంపు

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వివిధ జిల్లాల్లోని 71 ప్రాథమిక సహకార సంఘాల(పీఏసీఎస్)కు అధికారిక పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలాన్ని అక్టోబరు 30 వరకు (ఆరు నెలలు) పొడిగించి, మరో ఐదు పీఏసీఎస్‌లకు కొత్తగా అధికారిక పర్సన్ ఇన్‌చార్జిలను నియమించింది. నంద్యాల జిల్లాలో రెండు పీఏసీఎస్‌లకు అధికారిక పర్సన్ ఇన్‌చార్జిలను మార్చారు. కాగా, రాష్ట్రంలో ప్రకృతి విపత్తులకు గురయ్యే ప్రాంతాల్లో ప్రపంచ ఆహార కార్యక్రమం కింద భారత్, శ్రీలంక ప్రభుత్వాలు ఐదేళ్ల పాటు నిర్వహించే అడాప్షన్ ఫర్ రెసిలియెన్స్ ప్రాజెక్ట్ (ఏడీఏపీటీ4ఆర్)ను క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి ఏపీ రైతుసాధికార సంస్థకు అధికారం ఇస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఒక్కటైన 25 జంటలు

గుడిబండ, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీసీగిరి గ్రామానికి చెందిన పుట్టలక్ష్మమ్మ, జయరామిరెడ్డి ఆధ్వర్యంలో 25జంటలు ఒక్కటయ్యాయి. వధూవరులకు మాజీ మంత్రి రఘువీరారెడ్డి తాళిబొట్లను అందించారు. గురువారం రంగనాథస్వామి ఆలయం ముందు వేద పండితుల మంత్రోచ్చారణతో జంటలు ఒక్కటయ్యాయి. మున్ముందుకూడా పేద ప్రజల కోసం సేవా కార్యక్రమాలు చేపట్టాలని మాజీ మంత్రి రఘువీరారెడ్డి సూచించారు.

న్యూస్ బాక్స్

ఘనంగా మే డే

కార్మిక దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ, సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీలు, సభలు జరిగాయి. మే డే గురించి వక్తలు వివరించారు.


గోరంట్లలో మేడే జరుపుకుంటున్న కార్మిక సంఘాల నాయకులు


చిలమత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు


పెనుకొండ నగర పంచాయతీ కార్యాలయం వద్ద పతాకావిష్కరణ చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు


మడకశిరలో జెండాను ఎగరవేస్తున్న సీఐటీయూ నాయకులు


లేపాక్షిలో జెండా ఎగురవేస్తున్న సీపీఐ నాయకులు


అమరాపురంలో మానవహారం


హిందూపురంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద వేడుకల్లో పాల్గొన్న చైర్మన్ రమేష్, కమిషనర్ శ్రీనివాసులు



తూమకుంట పారిశ్రామికవాడలో కార్మికుల ర్యాలీ


లోక్‌అదాలత్ ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవం నిర్వహించిన సందర్భంగా కార్మికులను సన్మానిస్తున్న అదనపు జిల్లా న్యాయాధికారి కంపెల్ల శైలజ


గోరంట్ల పంచాయతీ కార్యాలయంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి అశ్వత్థరెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ


టీడీపీ కార్యాలయంలో నిమ్మల శ్రీధర్ ఆధ్వర్యంలో హమాలీలకు దుస్తులు పంచుతున్న తహసీల్దార్ మారుతి, సీఐ శేఖర్

రోడ్లు, డ్రైనేజీలు నిర్మించండి

పెనుకొండ, మే 1(ఆంధ్రజ్యోతి): రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని టీడీపీ నాయకులను 1వ వార్డువాసులు కోరారు. శుభోదయంలో భాగంగా గురువారం టీడీపీ నాయకులు ఆ వార్డులో పర్యటించారు. టీడీపీ చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. సమస్యలను నాయకులకు వివరించగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్, తహసీల్దార్ శ్రీధర్, కన్వీనర్ శ్రీరాములు, కౌన్సిలర్ హనుమంతు, పాలడుగు చంద్ర, సాయిప్రసాద్, బీజేపీ రామక్రిష్ణ, జనసేన శ్రీదేవి, నజీర్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు మృగ్యం

మండుటెండలోనే పనులు

సోమందేపల్లి, మే 1(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో మండలవ్యాప్తంగా 6838మంది జాబ్‌కార్డు కలిగిన కూలీలున్నారు. వేసవిలో పని ప్రదేశంవద్ద సౌకర్యాలులేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం కూలీలకు అవసరమైన సౌకర్యాలకల్పనకు చొరవ చూపకపోవడంతో ఎండలధాటికి విలవిలలాడుతున్నారు. ఉపాధిపథకంలో 2025-26కు సంబంధించి ఏప్రిల్ మాసంలో కొత్త పనిముట్లను అందజేసి పనిప్రదేశాల్లో నీడకోసం తార్పాలిన్ పట్టలు అందించాల్సి ఉంది. అదేవిధంగా నీటి సౌకర్యం, మజ్జిగ, ఫస్ట్‌ఎయిడ్ లాంటి సౌకర్యాలు కల్పించాలన్న నిబంధనలు ఉన్నాయి. అయితే అవి ఎక్కడా అమలు కావడంలేదు. దీంతో కూలీలు ఎండలను భరిస్తూనే పనిచేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం పెంచిన వేతనం రూ.307 అన్నింటినీ సద్దుబాటు చేయడంతో సమస్య తలెత్తుతోందని అధికారులు పేర్కొంటున్నారు. మండలవ్యాప్తంగా రైతు పొలంలో సరిహద్దు కందకాలు, డకౌట్ పాండ్‌లు, చెరువులు, కుండల్లో డీషెడ్డింగ్ పనులు జరుగుతున్నాయి. ఈదిశలో శ్రమకు తగ్గ ఫలితం దక్కడం లేదని వాపోతున్నారు. ఎండలో పనిచేయలేక కూలీలు గిట్టుబాటుకాక సతమతమవుతున్నారు. మండలవ్యాప్తంగా 162 శ్రమశక్తి సంఘాలున్నాయి. ప్రతి సంఘానికి మేట్ ఉంటాడు. తమకు అవసరమైన పనిముట్లు ఇవ్వడంలేదని పేర్కొంటున్నారు. క్యూబిక్ మీటర్‌కు రూ.307చొప్పున కూలీ అందిస్తున్న మస్టర్లను తమకు ఇవ్వడం లేదని అంటున్నారు. ప్రతి వారం చేసిన పనికి పేస్లిప్‌లు ఇవ్వడంలేదని,చేసిన పనులకు కొన్నివారాలుగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొంటున్నారు. ఏటా కోట్ల నిధులను ప్రభుత్వం ఉపాధి పనులకు వినియోగిస్తోంది. గతంలో పనిముట్ల కోసం ప్రత్యేక సదుపాయం ఉండేది. ఏడాది నుంచి పనిముట్లను ఇవ్వడంలేదని, ఇప్పటికైనా తమకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీఓ నరేంద్రకుమార్‌ను వివరణ కోరగా వేసవి దృష్ట్యా 10గంటల్లోపు పనులను పూర్తీచేసుకోవాలని సూచించారు. ఐదేళ్ల క్రితం తార్పాలిన్ పట్టాలు అందివ్వడం జరిగిందని, ప్రస్తుతం సరఫరా కాలేదన్నారు. కూలీ రూ.307కు పెంచినందున పనిముట్లు, నీళ్లు, మజ్జిగ తదితర వాటిని సద్దుబాటు చేసేవిధంగా ప్రభుత్వం కేటాయించిందన్నారు.


ఎండలో పనిచేస్తున్న కూలీలు



కూలీలకు అన్యాయం జరుగుతోంది

ఉపాధిహామీలో కూలీలకు అన్యాయం జరుగుతోంది. పనుల గుర్తింపు కోసం గ్రామసభలు పెట్టడం లేదు. చేసిన పనికి పే స్లిప్పులు ఇవ్వడం లేదు. కూలీల వేతన బకాయిలు వారాలుగా పెండింగ్‌లో ఉంటూ వస్తున్నాయి. ఉపాధి పనిలో పాత విధానాలతో పనిముట్లు, తార్పాలిన్ పట్టలు అందించాలి. మస్టర్లలో అవకతవకలు జరుగుతున్నాయి.

- పెద్దన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

లోటుపాట్లు లేకుండా చూడండి: ఎస్పీ

హిందూపురం, మే 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో ఈ నెల 4న ఎమ్మెల్యే బాలకృష్ణకు నిర్వహించే పౌర సన్మాన సభలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఎస్పీ రత్న సూచించారు. ఎంజీఎం క్రీడా మైదానాన్ని డీఎస్పీ మహేష్‌తో కలిసి గురువారం ఆమె పరిశీలించారు. వీఐపీ, వీవీఐపీ గ్యాలరీ, సభావేదిక, ప్రజలు వచ్చిపోయే దారుల గురించి ఎస్పీ తెలుసుకున్నారు. వాహనాల పార్కింగ్, విద్యుత్ సమస్య లేకుండా చూడాలని అన్నారు. మైదానానికి ఆనుకుని రైల్వే ట్రాక్ ఉందని, ఎవరూ ట్రాక్‌పై వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంజీఎం మైదానం గోడలు పటిష్టంగా ఉన్నాయా లేదా అని ఆరాతీశారు. గోడల పక్కన ఎవరూ ఉండకుండా చూడాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏలు సురేంద్ర, వీరయ్య, బాలాజీ, టీడీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, మునిసిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ సంఘం శ్రీనివాసులు, తహసీల్దార్ వెంకటేశులు, సీఐలు రాజగోపాల్ నాయుడు, జనార్దన్, అబ్దుల్ కరీం, ఎస్‌బీ ఎస్ఐ ప్రదీప్, టీడీపీ నాయకులు నాగరాజు, అనీల్ తదితరులు పాల్గొన్నారు.


భద్రతా ఏర్పాట్లపై ఆరాతీస్తున్న ఎస్పీ, నాయకులు

నేడు ఎస్ఎస్ఎల్‌సి ఫలితాలు

పావగడ, మే 1(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలకు సంబంధించి ఫలితాలు శుక్రవారం విడుదల కానున్నట్లు విద్యాశాఖ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. మధ్యాహ్నం 12-30కు ఫలితాలు చూసుకోవచ్చని కర్ణాటక మౌల్య మాపన మండలి అధ్యక్షులు హెచ్ బసవరాజ్ వెల్లడించారు. తాలూకా వ్యాప్తంగా 16పరీక్షా కేంద్రాలలో 3325మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వారి భవిష్యత్తు నేడు తేలనుంది.

గురుకుల పాఠశాల ప్రవేశాలకు ఆహ్వానం

గోరంట్ల, మే1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం నుంచి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 3వ తరగతి నుంచి 9వతరగతి వరకు బాలికలను చేర్చేందుకు ఖాళీల వివరాలు తెలిపారు. 3వతరగతిలో 40, 4వ తరగతికి సంబంధించి 32, 5కు 31, 6లో 21, 7లో 1, 8లో 12, 9తరగతిలో రెండుసీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన గిరిజన విద్యార్థినులు ఈనెల 25లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం సెల్‌నెం. 8897820565ను సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోరంట్ల, మే1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వానవోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ బాలక్రిష్ణనాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తుండడంతో సరఫరా ఆపివేయడం జరుగుతుందన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని వానవోలు, గౌనివారిపల్లి, మలసముద్రం, వానవోలుతండా, కొండాపురం పంచాయతీ గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

చిలమత్తూరు, మే 1(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని మండల టీడీపీ కన్వీనర్ రంగారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్ పేర్కొన్నారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పద్మభూషణ్ పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా కనిశెట్టిపల్లిలో యువత కోసం బాలయ్య ప్రీమియర్ లీగ్- సీజన్-1 క్రికెట్ టోర్నమెంట్‌ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు టోర్నీని ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్యే బాలకృష్ణ యువత భవిష్యత్తు కోసం పాటుపడుతున్నారన్నారు. యువత క్రీడల పట్ల ఆశక్తి చూపాలన్నారు. టోర్నమెంట్‌లో విజేత జట్టుకు రూ. 30 వేలు, రన్నర్స్‌గా నిలిచిన జట్టుకి రూ. 15 వేలు నగదు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కురుబ చంద్రశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ నాగార్జున, మాజీ ఎంపీటీసీలు సూర్యనారాయణ, ప్రవీణ్‌కుమార్, నాయకులు మీసేవ సూరి, రిజ్వాన్, వెంకటేశులు పాల్గొన్నారు.

నీటి సరఫరా పునరుద్ధరణ

సోమందేపల్లి, మే 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాపిరెడ్డిపల్లి గ్రామంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి నీటి సరఫరాను గురువారం అధికారులు, నాయకులు పునరుద్ధరించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు నీరుగంటి చంద్రశేఖర్ మాట్లాడుతూ 15ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకును మంత్రి ఆదేశాల మేరకు మరమ్మతులు నిర్వహించి నీటి సరఫరాను పునరుద్ధరించడం జరిగిందన్నారు. పైప్‌లైన్ కనెక్షన్‌లను ఏర్పాటుచేసి గ్రామానికి నీటిని అందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రామాంజినేయులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మహేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతికి తరలిన తెలుగు తమ్ముళ్లు



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్

పెనుకొండ, మే 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులకు ప్రధాని నరేంద్రమోదీ హాజరవుతున్న సందర్భంగా మంత్రి సవిత ఆధ్వర్యంలో పెనుకొండ నియోజకవర్గంలో ఐదు బస్సుల్లో 200మంది కూటమి నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా అమరావతికి వెళ్తున్న బస్సులను ఆర్డీఓ ఆనంద్‌కుమార్, తహసీల్దార్ శ్రీధర్ జెండా ఊపి ప్రారంభించారు. నాయకులు శ్రీరాములు, సిద్దయ్య, సర్పంచ్ శ్రీరాములు, మాజీ సర్పంచ్ అశ్వర్థనారాయణ, రమణమ్మ, చంద్రకాంతమ్మ, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, జనసేన శ్రీదేవి, సమీ, వడ్డినాగప్ప, మంజునాథ్, ప్రభంజన్ తదితరులు పాల్గొన్నారు.

వితంతు పింఛన్ పంపిణీ


వితంతు పింఛన్ పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పరిగి, మే 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు గురువారం వితంతు పింఛన్‌ను పంపిణీ చేశారు. మండల పరిధిలోని పెద్దరెడ్డిపల్లి గ్రామంలో కృపాఅశ్వర్థప్ప 15రోజుల క్రితం మృతిచెందాడు. స్థానిక టీడీపీ నాయకులు ప్రవీణ్‌రెడ్డి మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లగా కురుబ వెంకటలక్ష్మమ్మకు వితంతు పెన్షన్‌ను మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో వారు పింఛన్‌ను అందజేశారు. కార్యక్రమంలో జూలారెడ్డి, మంజునాథ్, మంజు, సాయికుమార్, బూత్ ఇన్చార్జ్ శీనప్ప పాల్గొన్నారు.

'కుట్టుమిషన్ శిక్షణతో మహిళలకు భరోసా'

హిందూపురం, మే 1(ఆంధ్రజ్యోతి): మహిళలు కుట్టుమిషన్‌లో శిక్షణ పొందితే భవిష్యత్తులో వారికి ఆర్థిక భరోసా ఉంటుందని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. గురువారం మోడల్ కాలనీలో కుట్టుశిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత కుట్టుశిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టుమిషన్ ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బీజేపీ పట్టణాధ్యక్షురాలు అంజలి, బీజేపీ నాయకులు రమేష్‌రెడ్డి, రవితేజరెడ్డి, మెప్మా విజయలక్ష్మీ, బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఒక్కటైన 25 జంటలు

వధూవరులకు తాళిబొట్లు అందించిన రఘువీరారెడ్డి


వధూవరులకు తాళిబొట్లు అందిస్తున్న రఘువీరారెడ్డి

గుడిబండ, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీసీగిరి గ్రామానికి చెందిన పుట్టలక్ష్మమ్మ, జయరామిరెడ్డి ఆధ్వర్యంలో 25జంటలు ఒక్కటయ్యాయి. వధూవరులకు మాజీ మంత్రి రఘువీరారెడ్డి తాళిబొట్లను అందించారు. గురువారం రంగనాథస్వామి ఆలయం ముందు వేద పండితుల మంత్రోచ్చారణతో జంటలు ఒక్కటయ్యాయి. మున్ముందు కూడా పేద ప్రజల కోసం సేవా కార్యక్రమాలు చేపట్టాలని మాజీ మంత్రి రఘువీరారెడ్డి సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కన్వీనర్ నాగరాజు, జడ్పీటీసీ బూతరాజు పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

హిందూపురం, మే 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెట్‌సెంటర్‌లో పనిచేసే యువకుడు మహేష్(30) గుండెపోటుతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో పదేళ్లుగా మహేష్ ఇంటర్నెట్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం ఛాతిలో నొప్పి ఉందని ఆసుపత్రికి కూడా వెళ్లివచ్చాడు. అయితే గ్యాస్ట్రిక్ అనుకున్నాడు. కానీ ఇంటర్నెట్ సెంటర్‌లో కూర్చుని అలాగే ప్రాణాలు వదిలాడు. మహేష్ తండ్రి ఆంజనేయులు అనారోగ్యంతో కొన్నేళ్ల క్రితం మృతిచెందాడు. తల్లి సావిత్రమ్మ బట్టలుఉతుకుతూ జీవనం సాగిస్తోంది. తల్లికి చేదోడు వాదోడుగా ఉన్న కుమారుడు మృతిచెందడంతో తల్లి రోదనలు మిన్నంటాయి.


మహేష్ (ఫైల్)

ప్రజాసంక్షేమం ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే


వృద్ధులకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమం ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. మడకశిర మండలంలోని గోవిందాపురం గ్రామంలో గురువారం ఆయన వృద్ధులకు పింఛన్లను పంపిణీచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. అర్హులకు ప్రతిఒక్కరికీ పింఛన్లు అందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ సెల్ కృష్ణమూర్తి, మాజీ సర్పంచు చంద్రప్ప, రామకృష్ణ పాల్గొన్నారు.

అవగాహన ఒప్పందం


యూనివర్సిటీ ప్రతినిధుల అవగాహన ఒప్పందం

గోరంట్ల, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మలవాండ్ల పల్లి వద్ద ఉన్న బెస్టు యూనివర్సిటీ ఆధ్వర్యంలో భారతీయ విద్యార్థులకు దుబాయిలోని క్వీన్ ఎల్జిబెత్-2 హాస్పిటాలిటీ అకాడమీ మధ్య నైపుణ్యాల శిక్షణ అందించడానికి అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు రిజిస్ట్రార్ ప్రకాశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రెండు సంస్థలకు చెందిన సహీద్ ఆల్ బన్నెయ్, డాక్టర్ రూపా వాసుదేవన్ సంతకాలు చేయడం జరిగిందన్నారు. ఎంపికైన విద్యార్థులకు దుబాయిలో మూడునెలలపాటు శిక్షణ ఉంటుందన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

పరిగి, మే 1(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు పరిగి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని హర్షవల్లి ఎంపికైంది. ఇటీవల గుంటూరు జిల్లా తెనాలిలో రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి. ఇందులో పరిగి ఉన్నత పాఠశాల విద్యార్థినులు హర్షవల్లి, గంగమ్మ, వర్షిత, ప్రవల్లిక, భవ్య, రమ్య, సౌమ్య ఎంపికయ్యారు. ఈ పోటీల్లో హర్షవల్లి ప్రతిభకనబరచడంతో మైసూరులోని శ్రీరంగపట్నంలో జరుగుతున్న పోటీల్లో పాల్గొంటోంది. దీంతో హెచ్‌ఎం కృపాసత్యరాజ్, పీఈటీ వినోద్‌కుమార్‌కు హర్షవల్లి తండ్రి తిప్పన్న కృతజ్ఞతలు తెలిపారు.


హర్షవల్లి

ఐటీఐ కళాశాల నిర్మాణానికి స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

పెనుకొండ, మే 1(ఆంధ్రజ్యోతి): పెనుకొండలో నూతనంగా ఏర్పాటుకానున్న ఐటీఐ కళాశాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని అధికారులు, టీడీపీ నాయకులు గురువారం పరిశీలించారు. స్థానిక గొర్రెల పెంపక క్షేత్రం వద్ద స్థలాన్ని ఆర్‌అండ్‌బీ అధికారులు ఈఈ సంజీవప్ప, డీఈ వెంకటరామిరెడ్డి, వెంకటేశులు, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రాయప్పరెడ్డి, మంత్రి పీఏ శ్రీనివాసులు, సర్వేయర్లు, టీడీపీ నాయకులు కళాశాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. గొర్రెల పెంపక క్షేత్రం వద్ద రెండు ఎకరాల స్థలాన్ని కళాశాలకు అనువైన స్థలంగా గుర్తించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసులు, త్రివేంద్ర, చంద్రకాంతమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

4న ఉచిత కంటి వైద్యశిబిరం

అగళి, మే 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్డీటీ భవనంలో ఈనెల 4న ఆదివారం ఉదయం 9గంటల నుంచి మెగా ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జడ్పీటీసీ ఉమేష్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి హాజరవుతారన్నారు. బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆపరేషన్లు కూడా ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరానికి వచ్చేవారు ఫోన్‌నంబరు, రేషన్‌కార్డు, ఆధార్ జిరాక్స్ కాపీలు తప్పకుండా తీసుకురావాలన్నారు.

చోరీకి విఫలయత్నం

హిందూపురం, మే 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో గురువారం ఉదయం ఓ ఇంట్లో చోరీకి దొంగలు విఫలయత్నం చేశారు. ఆర్టీసీ కాలనీలోని సెట్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉదయం 5-30కు ఇంటిలో ఉన్న మహిళ నమాజు చదువుకోవడానికి వరండాలోకి తలుపు తీసి వచ్చింది. పక్కనే ఉన్న ఇద్దరు దుండగులు లోనికి ప్రవేశించారు. అయితే ఆమె చూసి కేకలు వేయడంతో బయటికి పరుగులు తీశారు. చుట్టుపక్కలవారు బయటికి రావడంతో దొంగలు పరారయ్యారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం

హిందూపురం, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చలివెందుల కొండపై వెలసిన శ్రీలక్ష్మీగవి రంగనాథస్వామి కల్యాణ రథోత్సవంలో భాగంగా గురువారం జ్యోతుల ఉత్సవం జరిగింది. ప్రత్యేకంగా బియ్యం పిండితో చేసిన జ్యోతులను తలపై పెట్టుకుని గ్రామానికి కిలోమీటరు దూరంలో ఉన్న కొండకింద రంగనాథస్వామి మెట్లవద్ద భక్తులు జ్యోతులను సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆలయం వద్ద అభిషేకం, సహస్రనామపూజ, దీపోత్సవం, రాత్రి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది.

నేడు బ్రహ్మరథోత్సవం

శ్రీలక్ష్మీగవి రంగనాథస్వామి బ్రహ్మరథోత్సవం శుక్రవారం వైభవంగా జరగనుంది. ఈ రథోత్సవానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరానున్నారు.


జ్యోతులతో మహిళలు